సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 17 । జనవరి । 2024



నగర వనాలకు శ్రీకారం

ఏలూరు జిల్లాలో తొలిసారిగా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో అటవీ ప్లాంటేషన్‌ను అధికారులు నగర వనంగా తీర్చిదిద్దుతున్నారు. దీనిపై ప్రత్యేక కథనం 8లో ▸



ఏలూరులో వ్యక్తి హత్య

ఏలూరులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్నేహితుల మధ్య వివాదం హత్యకు దారి తీసింది. నిందితుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



బాస్కెట్ బాల్ పోటీల ప్రారంభం

నూజివీడులోని ధర్మా అప్పారావు కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. 8లో ▸

కనుమ రోజూ.. అదే జోరు

- మూడో రోజూ కొనసాగిన కోడి పందేలు
- రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుగులో భారీగా..
- బరుల వద్ద యథేచ్ఛగా గుండాట, పేకాట



ఫ్లడ్‌లైట్స్ కాంతిలో పెద అమిరంలోని ఓ కోడి పందేల శిబిరం

భీమవరం: సంక్రాంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంప్రదాయ కోడి పందేలు మూడో రోజూ జోరుగా సాగాయి. జిల్లాలోని భీమవరం, ఉండి, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట నియోజకవర్గాల్లో రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు కోడిపందేలు నిర్వహించారు. పందేలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పందేల బరులు కిటకిటలాడాయి. కోడి పందేలతో పాటు గుండాట, పేకాట వంటి జూదాలు కూడా విచ్చలవిడిగా సాగాయి. కోడిపందేల బరులు వద్ద జూదాలు ఏర్పాటుకు నిర్వాహకులు వేలం పాటలు నిర్వహించగా, పెద్ద బరుల వద్ద జూదాల నిర్వహణకు అధిక మొత్తంలో పాటలు పాడినట్లు తెలుస్తోంది. కాళ్ల, తణుకు, ఆకివీడు, యలమంచిలి, ఇరగవరం, అత్తిలి, వీరవాసరం, ఉండి తదితర మండలాల్లో రూ.కోట్లలో బెట్టింగ్‌లు సాగాయి. నగదు లెక్కింపునకు ప్రత్యేకంగా కౌంటింగ్ మెషీన్లు ఏర్పాటు చేయడం గమనార్హం.

పగలు, రాత్రి తేడా లేకుండా..

రాత్రి సమయంలో సైతం కోడి పందేలు, జూదాలు నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఫ్లడ్‌లైట్స్ ఏర్పాటు చేయడమేగాక పందేలను స్పష్టంగా చూడడానికి కొన్ని చోట్ల ఎల్‌ఈడీ టీవీలు సైతం ఏర్పాటు చేశారు. కాళ్ల మండలంలో బౌన్సర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక రక్షణ కంచెలను ఏర్పాటు చేశారు. వీక్షించే వారిని అనుమతించడానికి వారి చేతులకు ప్రత్యేక ట్యాగ్‌లు వేశారు.



నారాయణపురంలో కోడి పందేన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



కోడి పందేల బరిలో బొంగు బిర్యాని విక్రయాలు

బారులు తీరిన కార్లు : కోడి పందేల బరులు వద్ద భారీ సంఖ్యలో చిన్నకార్లు, మోటారు సైకిళ్ల బారులు తీరాయి. పందేల ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అక్కడే భోజనాలతోపాటు అన్ని రకాల తినిబండారాలు అందుబాటులో ఉండడంతో పందెంరాయుళ్లు, వీక్షకులు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోడూరు మండలం కవిటం వద్ద నిర్వహించిన కోడి పందేల శిబిరం వద్ద జూదగాళ్లు విశ్రాంతి తీసుకోడానికి ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచారు.

కోడి కత్తి తగిలి వ్యక్తికి తీవ్ర గాయం



కోడికత్తి తగిలి గాయపడ్డ చంటిరాజు

ఉండి గ్రామంలోని పెదపుల్లేరు రోడ్డులో నిర్వహించిన కోడిపందేల శిబిరం వద్ద పందేలు తిలకిస్తున్న చంటిరాజు అనే వ్యక్తి కాలికి కోడి కత్తి ప్రమాదవశాత్తు తగిలి తీవ్ర గాయం కావడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అలాగే భీమవరం మండలం తాడేరు గ్రామం వద్ద కోడిపందేల శిబిరం వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరి తలకు తీవ్ర గాయమైంది.

విజేతలకు ద్విచక్ర వాహనాలు



పెన్నాడ కోడిపందేల్లో బుల్లెట్ దక్కించుకున్న శృంగవృక్షం నివాసి బబ్లు

పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామం వద్ద నిర్వహించిన కోడిపందేల్లో ఎక్కువ పందేలు గెలిచిన శృంగవృక్షం గ్రామానికి చెందిన బబ్లు అనే వ్యక్తి బుల్లెట్ మోటారు సైకిల్ గెలుచుకోగా మరో ఇద్దరు విజేతలకు నిర్వాహకులు స్కూటీలను బహుమతులుగా అందజేశారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



కల్యాణానికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాబాద్రా పురస్కరించుకుని గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి క్షేత్రంలో మంగళవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు కల్యాణ తంతు జరిపించారు. స్వామి వారి కల్యాణానికి ఈవో ఆకుల కొండలరావు పట్టువస్త్రాలను సమర్పించారు. కనుమ పండుగ కావడంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి రూ.1,54,505 ఆదాయం వచ్చిందని, 1500 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఈవో తెలిపారు.

అబుదాబీలో సంక్రాంతి సంబరాలు



అబుదాబీ సంబరాల్లో పాల్గొన్న తెలుగువారు

పెనుగొండ: తెలుగువారి పండుగ సంక్రాంతిని అబుదాబీలోనూ వేడుకగా నిర్వహించారు. తెలుగు ఫెస్టివల్ ఫ్యామిలీ గ్రూపు ఆధ్వర్యంలో దాదాపుగా 125 తెలుగు కుటుంబాలు పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు భోగి పండ్లు పోయడం, వెంకటేశ్వరస్వామికి అభిషేకాలు, అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు.

వేమన జయంత్యుత్సవాలు ప్రారంభం



ఆరవల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

అత్తిలి: ఆరవల్లిలో శ్రీయోగి వేమన 99వ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ వెలగల సుస్మిత, ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి రమ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. పేదలకు వస్త్రదానం చేశారు. ప్రతి ఏడాది వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను వీరభద్రారెడ్డి అభినందించారు. వీరభద్రారెడ్డిని వేమన జయంతి ఉత్సవ కమిటీ తరఫున సత్కరించారు. ఈనెల 18న వేమన జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వేమన జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి చెప్పారు. రెడ్డి అండ్ రెడ్డి అధినేత గొలుగూరి శ్రీరామారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, రిటైర్డు మాస్టర్ వెలగల రామకృష్ణారెడ్డి, వెలగల విజయభాస్కరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుషారుగా 'ఆడుదాం'



కబడ్డీ ఆడుతున్న యువకులు

పెంటపాడు: మండలంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పండుగల సెలవులు కావడంతో క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పెంటపాడు ఎస్‌టీవీఎన్ హైస్కూల్లో కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా జరుగుతున్న ఈ మండల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా పలువురు విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంపీడీవో బాలాజీ పర్యవేక్షణలో నిర్వహించారు. ఎంఈవో రామక్రిష్ణ, క్రీడల ఇన్‌చార్జి డి.శేఖర్, పీడీలు సత్తికన్నారెడ్డి, ఆర్డీ కృపావరం, ఎస్.దీలిప్, హోసాన్, వైశాలీ సత్తి శ్రీనివాసరెడ్డి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కనుమ ఉత్సవం



కనుమ మండపంలో స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కనుమ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉత్సవంలో భాగంగా మంగళవారం దొరసానిపాడు గ్రామానికి తరలివెళ్లిన స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తజనులు పరవశించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, గజ, అశ్వ సేవలు, కేరళ డప్పు వాయిద్యాల నడుమ దొరసానిపాడు గ్రామంలో ఉత్సవం అంబరాన్నంటింది. ముందుగా శ్రీవారి ఆలయంలో మధ్యాహ్నం ఉభయ దేవేరులతో స్వామివారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు, కొండ వెనుక భాగాన ఉన్న దొరసానిపాడు గ్రామానికి కనుమ ఉత్సవం నిమిత్తం అట్టహాసంగా తరలివెళ్లారు. గ్రామంలో మహిళలు శ్రీవారి వాహనం వచ్చే దారి పొడవునా రంగవల్లులను తీర్చిదిద్ది, పూలతో ఘనస్వాగతం పలికారు. దొరసానిపాడు పురవీధుల్లో తిరుగాడిన అనంతరం స్వామివారు కనుమ మండపం వద్దకు చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత శ్రీవారు, అమ్మవార్లను మండపంలో ఉంచి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఉత్సవం అనంతరం భక్తులకు స్వామివారి తీర్ధ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లు గిరిప్రదక్షిణగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

9 మంది ఎస్సైల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లాలోని 9 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు రేంజ్ పరిధిలో భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు చేపట్టారు. ఇప్పటికే రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో 117 మంది ఎస్‌ఐలను బదిలీ చేయగా, తాజాగా పశ్చిమలో ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది.

ఎస్సై	ప్రస్తుతం	బదిలీ స్థానం
డి.హరికృష్ణ	పెంటపాడు	వీఆర్ భీమవరం
బి.మోహనరావు	భీమవరం రూరల్	పెంటపాడు
జీజే ప్రసాద్	తాడేపల్లిగూడెం టౌన్	వీఆర్ భీమవరం
బి.రాజు	తాడేపల్లిగూడెం రూరల్	వీఆర్ భీమవరం
జీవీఎన్ ప్రసాద్	సీసీఎస్ భీమవరం	తాడేపల్లిగూడెం టౌన్
ఎం.వీరబాబు	మొగల్తూరు	వీఆర్ భీమవరం
పి.అప్పారావు	భీమవరం టూటౌన్	తణుకు టౌన్
కె.చంద్రశేఖర్	సీసీఎస్ భీమవరం	తణుకు రూరల్
ఎస్ఎన్‌వీవీ రమేష్	పెనుగొండ	వీఆర్ భీమవరం

మావుళ్లమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దర్శనానికి మంగళవారం భారీగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి 60వ వార్షిక మహోత్సవాలు, సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి, చుట్టుపక్కల భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి కోడిపందేలు తిలకించడానికి వచ్చిన వారు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు, భారీ సెట్టింగ్‌లను ఆసక్తిగా తిలకించారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు కళా ప్రదర్శనలు నిర్వహించారు. నీరుల్లి పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ముక్కనుమ.. లాగించేద్దామా

- నేడు మాంసాహార ప్రియులకు పసందైన రోజు
- భారీగా మాంసం విక్రయాలకు అవకాశం



తణుకు: తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుంది. కొన్నిచోట్ల భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడు రోజులు ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో ముక్కనుమ పేరుతో నాలుగో రోజూ పండుగ జరుపుకుంటారు. సాధారణంగా భోగి, సంక్రాంతి రోజుల్లో మాంసాహారం ముట్టుకోరు. ఇక కనుమ, ముక్కనుమ రోజుల్లో ఎవరికి నచ్చిన మాంసాహారాన్ని వాళ్లు భుజిస్తారు. వాస్తవంగా కనుమ రోజు కూడా మాంసాహారాన్ని ముట్టుకోవద్దని కొంతమంది పండితులు చెబుతుంటారు. దీంతో సంక్రాంతి పండుగ ముగిసే ముక్కనుమ రోజున గ్రామదేవతలకు పసుపు, కుంకుమ ఇచ్చి పూజలు చేస్తారు. ముక్కనుమ నాడు సాధారణంగా మాంసాహార ప్రియులు తాము ఇష్టపడే వివిధ మాంసాహార వంటకాలను వండుకుని కుటుంబ, బంధు, మిత్రులతో కలిసి తిని ఆనందిస్తారు. పండుగలోని మొదటి మూడు రోజులు కేవలం శాఖాహారమే భుజించాలని ఇది శాస్త్రీయమైన సంప్రదాయం, ఆరోగ్యసూత్రమని చెబుతుంటారు.

ఆఫర్లూ ప్రకటించే అవకాశం

ముక్కనుమ రాకతో మాంసాహార ప్రియుల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా మాంసం విక్రయాలు జరగనున్నాయి. సాధారణంగా ఆదివారం, పండుగ సమయాల్లో అధిక మొత్తంలో మాంసం విక్రయాలు జరుగుతుంటాయి. అయితే సంక్రాంతి నాలుగోరోజైన ముక్కనుమకు ఎలాంటి ఆటంకాలు లేకపోడంతో మాంసం అమ్మకాలకు వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా మాంసాహారంలో చికెన్ తర్వాతి స్థానంలో మటన్ విక్రయాలు జరుగుతుంటాయి. ఈ సారి ముక్కనుమ రోజున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 క్వింటాళ్ల మేర చికెన్, మరో 100 క్వింటాళ్ల మటన్ అమ్మకాలు జరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఈ సీజన్‌లో చికెన్ ధర తగ్గి రూ.200 పలుకుతుండగా, మటన్ ధర రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. మరోవైపు ముక్కనుమ రోజున మాంసాహార విక్రయాలకు కొందరు వ్యాపారులు సైతం ఆఫర్లు ప్రకటిస్తుండటం విశేషం.

రెట్టింపు అమ్మకాలు

సాధారణంగా గోదావరి జిల్లాల్లో ముక్కనుమ రోజున మాంసాహారం తినడం ఆనవాయితీ. ఈ సారి ముక్కనుమ రోజున ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో మాంసం విక్రయాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. సాధారణంగా ఆదివారంతోపాటు ప్రత్యేక పండుగల్లో మాంసం కొనుగోలు చేస్తారు. అయితే ప్రస్తుతం రెండు రెట్లు అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నాం.

– బండి గణేష్, చికెన్ వ్యాపారి, తణుకు

గ్రామాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం

గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా పంచాయతీల్లో క్షేత్ర స్థాయి అవసరాలతో పాటు తొమ్మిది థీమ్‌ల అమలుకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు షెడ్యూల్ విడుదల చేశాయి. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్‌కు శిక్షణ పూర్తి చేయగా, 17, 18 తేదీల్లో మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు.

- పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కసరత్తు
- తొమ్మిది థీమ్‌లతో యాక్షన్ ప్లాన్ తయారీకి మార్గదర్శకాలు
- ప్రతి ఏడాదీ ఒకటి, లేదా రెండు థీమ్‌ల అమలుకు ప్రాధాన్యం
- ఇప్పటికే డ్రాఫ్ట్ జీపీడీపీ తయారీపై ఆర్పీలకు శిక్షణ పూర్తి



విస్సాకోడేరు గ్రామ సచివాలయం

సాక్షి, భీమవరం: జిల్లాలోని 20 మండలాల పరిధిలో 593 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధుల వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తుంటారు. జనరల్ ఫండ్స్‌లో 30 శాతం సిబ్బంది జీతభత్యాల కోసం, 15 శాతం తాగునీటి అవసరాలు, 15 శాతం పారిశుద్ధ్య నిర్వహణ, 15 శాతం వీధిలైట్ల నిర్వహణ, 10 శాతం రోడ్లు, డ్రెయిన్ల మెయింటెనెన్స్, 10 శాతం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, 5 శాతం నిధులు ఈ–గవర్నెన్స్ (కంప్యూటర్లు, ఇతర సాంకేతిక అవసరాలు) కోసం వ్యయం చేయాల్సి ఉంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు టైడ్ గ్రాంట్ 50 శాతం పారిశుద్ధ్యం, 50 శాతం తాగునీటి అవసరాలకు వెచ్చించాలి. అన్‌టైడ్ గ్రాంట్ స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

తొమ్మిది థీమ్‌ల ప్రాతిపదికగా..

పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రం, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామం.. ఇలా తొమ్మిది అంశాల ప్రాతిపదికగా యాక్షన్ ప్లాన్ తయారీకి గత ఏడాది నుంచే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి పంచాయతీ వీటిలో కనిష్టంగా ఒకటి, గరిష్టంగా రెండు థీమ్‌లు ఎంచుకుని నిధుల కేటాయింపులో వీటి అమలుకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఆ మేరకు గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఏటా ఒక థీమ్‌ను ఎంచుకుని ప్రణాళిక ప్రకారం గ్రామాల అభివృద్ధి చేసుకోవాలన్నది వీటి ముఖ్య ఉద్దేశం. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీలోగా జీపీడీపీ (2024–25) ఆమోదానికి పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాలి. 27 నుంచి 28వ తేదీ వరకు గ్రామ స్థాయిలో ఆమోదించిన జీపీడీపీని మండల స్థాయి కమిటీ పరిశీలన చేస్తుంది. అనంతరం 28, 29 తేదీల్లో గ్రామ పంచాయతీ తీర్మానం ఆమోదం, ఇలా ఆమోదించిన ప్రణాళికలను ఈ–గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో ఈ నెల 31లోగా అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 29వ తేదీలోగా మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) తయారు చేయాల్సి ఉంది. అలాగే జిల్లా పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికను కూడా ఆమోదించాల్సి ఉంటుంది.

ప్రణాళిక మేరకు నిధులు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు జీపీడీపీలను రూపొందించడం జరుగుతుంది. ఈ ప్రణాళిక మేరకు నిధుల విడుదలవుతాయి. జీపీడీపీ రూపకల్పనపై ఇప్పటికే జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాం.

– జీవీకే మల్లికార్జునరావు, డీపీఓ, పశ్చిమగోదావరి జిల్లా

మండల రిసోర్స్ పర్సన్‌కు శిక్షణ పూర్తి

పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (డ్రాఫ్ట్ జీపీడీపీ) తయారీపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మండలాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, ఈఓపీఆర్డీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, మండలం నుంచి ఒక కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్‌లకు పట్టణంలో ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజుల ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. వీరంతా ఈ నెల 17, 18 తేదీల్లో మండల స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, ఫంక్షనల్ కమిటీలకు శిక్షణనిస్తారు.

జాతీయ సదస్సుకు 15 మంది బృందం

ఆరోగ్యకరమైన గ్రామాలు అనే అంశంపై ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు తిరుపతిలో జరిగే జాతీయస్థాయి సదస్సుకు జిల్లా నుంచి ఎంపిక చేసిన 15 మంది బృందం వెళ్లనుంది. వీరిలో జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీ సీఈఓతో పాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ సెక్రటరీ, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, డ్వాక్రా సంఘం నుంచి ఒక్కరు చొప్పున హాజరుకానున్నారు.

క్లుప్తంగా

మల్లఖాంబ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మల్లఖాంబ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

భీమవరం: జాతీయ స్థాయి ఖేల్ ఇండియా పోటీల్లో మల్లఖాంబ్ క్రీడ రాష్ట్ర స్థాయి జట్టును మంగళవారం భీమవరంలో ఎంపిక చేసినట్టు శాప్ స్పోర్ట్స్ ఆఫీసర్ పి.సురేంద్రబాబు తెలిపారు. స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మల్లఖాంబ్ క్రీడలో రాష్ట్ర స్థాయి బాలుర జట్టుకు కె.వేణుసాయి, ఆర్ ఏసు, ఎం ఆదిత్య వెంకట దుర్గ, పి.గోపికృష్ణ, డి.ప్రసాద్, డి.సతీష్, స్టాండ్ బైగా జె.సతీష్, కె.టిమోతీలను ఎంపిక చేశామన్నారు. బాలికల జట్టుకు బి.గోపిక ఆదిసాయి, ఎ.భువన చంద్రిక, ఆర్ మనీషా, ఎం మౌనిక, బి.కీర్తి, ఆర్ దివ్యజ్యోతి, స్టాండ్‌బైగా బి.మురారీదివ్య, ఎస్ హేమలను ఎంపిక చేశామని సురేంద్ర తెలిపారు. 6వ జాతీయ స్థాయి ఖేల్ ఇండియా పోటీలు ఈనెల 21 నుంచి 4 రోజులుపాటు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ఎంపికల్లో పి.విజయకుమార్, ఎం శివ, మల్లఖాంబ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీసీ శేఖర రాజు, స్కూల్ హెచ్ఎం బి.శ్రీనివాసరావు, పీఈటీ డీవీ రామభద్రరాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

భీమవరం : చినఅమిరంలో జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. లోడుతో వెళుతున్న ట్రాక్టర్ టైరు పేలడంతో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ పి.నాగసత్యనారాయణ (35) మృతి చెందాడు. నాగ సత్యనారాయణ భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ జి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు.

యువతిపై కొడవలితో దాడి

ఉండి: ప్రేమపేరుతో యువతిపై ఓ వ్యక్తి కొడవలితో దాడి చేసి గాయపర్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం ఉప్పులూరు చెన్నకేశవస్వామి ఆలయ అర్చకుడు కొణతం వెంకట కేశవ శివసుబ్రహ్మణ్యం (42) తనను ప్రేమించాలంటూ అదే గ్రామానికి చెందిన యువతి (19) వెంట తిరుగుతున్నాడు. అతను మంగళవారం ఆమె ఇంటిలో చొరబడి యువతిపై కొవలితో దాడి చేశాడు. ఆమె గొంతు, చేతులకు గాయాలయ్యాయి. అడ్డుపడ్డ ఆమె తల్లినీ గాయపర్చాడు. దీంతో అతనిని స్థానికులు దేహశుద్ధి చేసి గాయపర్చారు. వీరందరినీ భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఏఎస్సై ఎ.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆరోగ్యం పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రేమపేరుతో బాలికను వేధించడంతో 2021లో కూడా అర్చకుడిపై ఉండి పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే.

నగర వనం.. ప్రకృతి నయగారం

- ఆహ్లాదాన్ని పంచే అందాలు
- బత్తులవారిగూడెంలో రూపుదిద్దుకుంటున్న వైనం



నూజివీడు నగరవనం



వాకింగ్ ట్రాక్



జారుడు బల్లలు



ఊయలలు



పులి చిత్రం

నూజివీడు: పక్షుల కిలకిలారావాలు.. ఎటు చూసినా పచ్చదనంతో కనువిందు చేసే దృశ్యాలు.. ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరడం ఓ చక్కటి అనుభూతి, మానసిక ప్రశాంతతను ఇస్తుంది. అయితే నేడు ఉరుకులు, పరుగులు పెట్టే పట్టణవాసికి అలాంటి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. నిత్యం ఒత్తిడి జీవితాన్ని గడిపే ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం నగరవనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లాలో తొలిసారిగా నూజివీడు మండలం బత్తులవారిగూడెం అటవీ ప్లాంటేషన్‌లో నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. మరికొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానున్న నగరవనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పట్టణ ప్రజలు రోజువారీ ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందేందుకు ఏకైక మార్గం సినిమాలుగా చెబుతారు. అయితే చాలా మంది సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. వారు ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలకు సెలవురోజుల్లో కుటుంబ సభ్యులతో వెళ్లి గడిపి వస్తున్నారు. పట్టణాలకు సమీపంలోనే ఉండే అటవీ ప్రాంతంలో వినోదం, విజ్ఞానం, ఆహ్లాదాలను మేళవించి ప్రజలకు కనువిందు చేయడమే నగరవనం లక్ష్యం.

రూ.1.50 కోట్లతో నగర వనం

నూజివీడు మండలం బత్తులవారిగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో నగరవనం రూపుదిద్దుకుంటోంది. 125 ఎకరాల్లో తొలివిడత రూ.1.50 కోట్లతో ప్రకృతి అందాలను తీర్చిదిద్దుతున్నారు. అటవీ అందాలు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ప్రజలు రోజంతా ప్రకృతి ఒడిలో పచ్చదనం తోడుగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేలా నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ఉయ్యాలలు, రంగులరాట్నం, జారుడు బల్లలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, వన్యప్రాణుల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఆయుర్వేద వైద్యానికి ఉపయోగించే మొక్కలు, చెట్లు నగరవనంలో కనువిందు చేయనున్నాయి. వివిధ రకాల పక్షుల బొమ్మలు, వన్యప్రాణుల చిత్రాలను సిద్ధం చేస్తున్నారు. సందర్శకుల కోసం పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, స్నాక్స్, టిఫిన్, భోజనం చేసేందుకు క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారు. పిల్లల కోసం ఆటవస్తువులు అందుబాటులో ఉంచనున్నారు. నగరవనంలోకి నామమాత్రపు ఫీజుతో ప్రవేశం కల్పించనున్నారు. ఇక్కడ అటవీ అందాలన్నీ వీక్షించడమే కాకుండా, చెట్ల ప్రాధాన్యత, మానవ జీవనానికి, పర్యావరణ పరిరక్షణకు ఎలా దోహదపడుతున్నాయో వివరించే ఏర్పాట్లు చేస్తున్నారు. నూజివీడు పట్టణం నుంచి మైలవరం రోడ్డులోని ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ నగరవనం సిద్ధమవుతోంది.

నెలాఖరు నాటికి పనులు పూర్తి

> బత్తులవారిగూడెం వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో నగరవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రజలకు ఆహ్లాదం, వినోదం, విజ్ఞానం పంచేందుకు ఈ నగరవనం ఎంతో దోహదపడుతుంది. ఈ నెలాఖరుకల్లా దీనిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులను వేగవంతం చేశాం.
>
> – దావీద్ రాజు, ఎఫ్ఆర్ఓ, నూజివీడు

క్రీడలకు అధిక ప్రాధాన్యత



బాడీబిల్డింగ్ చాంపియన్స్‌కు కప్పు అందిస్తున్న దృశ్యం

ఆకివీడు : క్రీడలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్ అన్నారు. డీవైఎఫ్ఐ సంక్రాంతి పోటీల్లో రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ యువజన సంఘాల కోరిక మేరకు సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. దీంతో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర పోటీలకు రూ.1100 కోట్లు విలువైన బహుమతులు అందజేస్తున్నారని చెప్పారు. ఇటువంటి పోటీల్ని సంఘాలు, పార్టీలకతీతంగా క్రీడాకారుల్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఎంతో వ్యయ ప్రయాసలతో సంక్రాంతి క్రీడీల్ని డీవైఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

బాడీబిల్డింగ్ పోటీల్లో చాంపియన్‌గా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన మిస్టర్ ఆంధ్ర టైటిల్‌తో పాటు గోల్డ్ మెడల్‌ను బి.ఆశిష్ కైవశం చేసుకోగా, ద్వితీయ స్థానంలో రాకేష్ (కృష్ణా జిల్లా), తృతీయ స్థానంలో గిరీష్ (ఎన్టీఆర్ జిల్లా) కైవశం చేసుకున్నారు. విజేతలకు అంబటి రమేష్‌తో పాటు సీఐ సత్యనారాయణ, డీవైఎఫ్ఐ ప్రతినిధులు బహుమలు ప్రదానం చేశారు.

పందెం బరుల్లో పలువురికి గాయాలు



గాయపడిన ఆటోడ్రైవర్



పందెం బరిలో గాయపడిన వ్యక్తి

పాలకోడేరు : కోడి పందేల బరుల్లో సాధారణంగా కోళ్లకు రక్తం చిమ్మడం చూస్తుంటాం. ఈ ఏడాది పాలకోడేరు మండలంలో జరిగిన పందేల బరుల్లో మనుషులకు కోడికత్తులు తగిలి గాయాలపాలయ్యారు. సోమ, మంగళవారంలో పలు ఘర్షణలు చోటుచేసుకొని నలుగురు, కోడి కత్తులు తగిలి పలువురు గాయపడ్డారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 14 మందికిపైగా కోడి కత్తి గాయాలతో వచ్చి వైద్యం పొందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. బరుల నిర్వాహకుల నిర్లక్ష్యం, అసమర్థత వల్ల కొట్లాటలు చోటుచేసుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి తలలు పగిలాయి. పాలకోడేరు ప్రధాన బరిలో గుండాట వద్ద చెలరేగిన వివాదంలో ఒక వ్యక్తి కుర్చీతో దాడి చేయడంతో అత్తిలి మండలానికి చెందిన సత్యనారాయణ తల పగిలింది. బరిలోనే స్పృహ తప్పిపడిపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి విషమయంగా ఉండటంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుముదవల్లికి చెందిన ఒక ఆటో డ్రైవరుకు తొడ వద్ద కోడి కత్తి తగిలి తీవ్ర గాయమైంది.

బాస్కెట్‌బాల్ పోటీలు నూజివీడుకే గర్వకారణం



హైదరాబాద్ ఫౌండేషన్ జట్ల మధ్య బాస్కెట్‌బాల్ మ్యాచ్



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు

నూజివీడు: బాస్కెట్‌బాల్ పోటీలు నూజివీడుకే గర్వకారణమని డీఏఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు అన్నారు. స్థానిక ధర్మా అప్పారావు కళాశాల ఆవరణలో శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 47వ స్మారక రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు చదువుకు ఇచ్చినంత ప్రాధాన్యత క్రీడలకు కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పర్వతనేని గంగాధరరావు, నూతక్కి వేణు, ఆక్రోబాస్కెట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లీగ్ మ్యాచ్‌లు

టోర్నమెంట్‌కు పురుషులు, మహిళల జట్లు మొత్తం 37 హాజరయ్యాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మంగళవారం నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లన్నీ ఉత్సాహభరితంగా సాగాయి. పురుషుల విభాగంలో ఖమ్మం – హైదరాబాద్ ఫౌండేషన్, గుంటూరు – గొల్లల మామిడాడ, ఆర్టలరీ హైదరాబాద్ – ఏలూరు, రామచంద్రాపురం – లయోల హైదరాబాద్, రామచంద్రాపురం – డీఏఆర్ నూజివీడు జట్ల మధ్య, మహిళల విభాగంలో చత్తీస్‌ఘర్ – డీఏఆర్ కళాశాల నూజివీడు, రామచంద్రాపురం – సీబీఏ విజయవాడ, పల్నాడు – ఏలూరు, ఏలూరు – మేరీస్ స్టెల్లా, సీబీఏ రాజమండ్రి – గుడివాడ జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించారు.

అమీనాపేటలో వ్యక్తి హత్య



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేటలో సంక్రాంతి రోజు ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన ఘర్షణలో ఒక స్నేహితుడు మృతి చెందాడు. ఈ వివరాలను డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకర్లకు వెల్లడించారు. ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన లక్కోజు సురేష్ (43) అమీనాపేటకు చెందిన కైతేపల్లి వంశీకుమార్ ఇద్దరూ స్నేహితులు. వీరు ఈనెల 14న రాత్రి అమీనాపేటలోని వంశీకుమార్ ఇంట్లో భోజనం చేసి, అక్కడే కొద్దిసేపు మాట్లాడుకున్నారు. 15న తెల్లవారుజామున మద్యం సేవించిన వీరు సంభాషణ మధ్యలో చిన్న విషయంలో చోటుచేసుకున్న వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. వంశీకుమార్, అతని తల్లిని సురేష్ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడాడు. దీంతో వంశీకుమార్ సురేష్ తలపై కర్రతో బలంగా మోదాడు. తీవ్ర రక్తస్రావంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. భయంతో వంశీకుమార్ పరారయ్యాడు. త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు, తన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు విచారణ చేపట్టారు. నిందితుడు వంశీకుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసును చేదించిన త్రీటౌన్ హెచ్‌సీలు ఓంప్రకాష్, పుల్లయ్య, యేసు, కానిస్టేబుల్స్ ఇస్సాకు, హేమసుందర్, రాజేంద్రప్రసాద్‌ను డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో త్రీటౌన్ ఎస్సైలు ఎస్‌కే మదీనా బాషా, జి.అజయ్‌కుమార్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం



యువకుడి మృతదేహం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, కోన సురేష్ (ఫైల్)

కొయ్యలగూడెం: మండలంలోని రాజవరం గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ షాక్‌కి గురై యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజవరం గ్రామానికి చెందిన కోన సురేష్ (33) విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు వేసే ప్రయత్నంలో షాక్‌తో మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న సురేష్ విద్యుత్తు శాఖ సిబ్బందికి కొన్ని సమయాల్లో సహాయపడుతూ ఉంటాడు. సంక్రాంతి రోజు సెలవు దినం కావడం, విద్యుత్‌కి అంతరాయం ఏర్పడడంతో ఆ శాఖ అధికారులు సురేష్‌ను ఫ్యూజు వేయాలని కోరినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎల్సీ తీసుకునే సమయంలో ఫ్యూజు గదికి అమర్చిన వైర్లు సురేష్‌కు తగలడంతో మృత్యువాత పడ్డాడని, దీనికి విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌పై వైర్లను నిర్లక్ష్యంగా కలిపి ఉంచడమే కారణమని స్థానికులు, మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి ఆరోపిస్తున్నారు. సురేష్ భార్య, కుమారుడికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పోలవరం రూరల్: పోలవరం మండలం పాత పట్టిసీమ, కొత్త పట్టిసీమ గ్రామాల మధ్య ఏటిగట్టు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. సోమవారం కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన మజ్జి శ్రీనివాస్, దైవ శిరోమణిలు పోలవరం నుంచి మోటార్ సైకిల్‌పై కొత్తపట్టిసీమ వస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం రాంపాలెం గ్రామానికి చెందిన హుస్సేన్ కిరణ్‌కుమార్ మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. ఈ రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పోలవరం వైద్యశాలకు తరలించారు. మజ్జి శ్రీనివాస్ (41) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. దైవ శిరోమణి, హుస్సేన్ కిరణ్‌కుమార్‌లను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు.

యువకుడి ఆత్మహత్య



ఫణీంద్ర మృతదేహం

కలిదిండి: యువకుడు ఉరి వేసుకుని మృతి చెందినట్టు ఎస్సై ప్రియా కుమార్ తెలిపారు. కొండంగి గ్రామానికి చెందిన కోకా పరశురామయ్య రొయ్యల సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆయన రెండో కుమారుడు ఫణీంద్ర (27) సోమవారం రొయ్యల చెరువు పాకలో ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భర్తతో విభేదాల కారణంగా ఇద్దరు పిల్లతో పుట్టింటి వద్దే ఉంటోన్న అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఇమ్మానేని లక్ష్మణరావు సోదరుడు కుమార్తెతో ఫణీంద్రకు పరిచయం ఏర్పడింది. ఇరువురు ఒకే సామాజికవర్గానికి చెందిన వారు. ఈ నేపథ్యంలో ఆమె ఫణింద్రను వివాహం చేసుకోవాలని కోరింది. దీనికి ఫణింద్ర తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆమె ఎంపీటీసీతో కలిసి కలిదిండి పోలీసులను ఆశ్రయించింది. వివాహం చేసుకోవాలని ఒత్తిడి పెరగడంతో ఫణింద్ర ఉరి వేసుకుని మృతి చెందాడన్న పణీంద్ర తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మృతదేహాన్ని ఎంపీటీసీ ఇంటి ముందు ఉంచి మృతిని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ధర్నా చేశారు.

జీడి మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో పూతతో ఉన్న జీడి మామిడి తోట



జీడిమామిడి ఆకుకు సోకిన టి దోమ

చింతలపూడి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం జీడి తోటలు పూత దశలో ఉన్నాయి. పూత దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అడపా దుర్గేష్ రైతులకు పలు సూచనలు చేశారు. సాధారణంగా జీడి మామిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో మొదలై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిచెట్టుకు వచ్చిన పూతలో సుమారు 200 నుంచి 800 వరకు పూలు పూస్తాయి. జీడిమామిడి చెట్లు పరాగ సంపర్కం వల్ల ఫలదీకరణ చెందుతాయి. జీడిమామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుంచి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి. అక్టోబర్ నెల నుంచి నవంబర్ వరకు వర్షాలు పడి పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తెగుళ్ల తీవ్రత కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి. జీడిమామిడి అంట్లు నాటిన రెండో ఏట నుంచే పూత వస్తుంది. ఆ పూతను రైతులు తుంచేసి చెట్ల శాఖలు పెరగడానికి ప్రోత్సహించాలి. దీంతో చెట్లు బలంగా పెరిగి ఎక్కువ దిగుబడిని ఇస్తాయి.

- వర్షా కాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదేళ్ల పైబడిన చెట్టుకు యూరియా 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు, పొటాష్ 1 కేజీ వేసుకోవాలి.
- పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వల్ల తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.
- జీడిమామిడిలో టి దోమ పూత దశ అంటే అక్టోబర్, నవంబర్ నెలలో మొదలవుతుంది. జనవరిలో ఎక్కువై లేత చిగుళ్లు, పూత, పూత కాడలు, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. పూత, చిగుర్లపై చేసిన రంధ్రాల వల్ల ఫ్లవర్ బ్లైట్ అనే తెగులుకూడా వ్యాప్తి చెందుతుంది. దోమ నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒక సారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండో సారి, టి దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు (కాయ గోలీ సైజులో ఉన్నప్పుడు) మూడో సారి పిచికారీ చేయాలి.
- చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీకి రైతులు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటరు నీటికి, లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ. లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ., లీటర్ నీటికి కలిపి రెండో సారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ., లీటర్ నీటికి కలిపి మూడో సారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.
- పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు కూడా ఎక్కువగా పూతను నష్ట పరిచి పూత రాలిపోయేలా చేస్తుంది. బూడిద తెగులు వల్ల లేత చిగుళ్లను, పూతను ఆశించి ఎండిపోయేలా చేసి పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ట్రై డేమోర్ఫ్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు, పూత, కాయమచ్చ తెగులు నివారణ

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత, పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మంకోజెబ్ 1 గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరో తాలోనిల్ 1 మిలీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



అడపా దుర్గేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యాన శాఖ

క్లుప్తంగా

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు


కృష్ణ మందిరంలో గో పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కనుమ సందర్భంగా మంగళవారం స్థానిక రామచంద్ర రావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహాయ సహకారములతో గో పూజ, గణపతి పూజలు, అష్టోత్తర శతనామ పూజలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను మందిరం కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

యువత సామాజిక సేవలో ముందు ఉండాలి


వృద్ధులకు బియ్యం పంపిణీ చేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత సామాజిక సేవలో ముందు ఉండాలని లయన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. పట్టణంలో డైమండ్స్ ఆధ్వర్యంలో కోనా హనుమాన్ సహకారంతో పేద మహిళలకు రైస్ బ్యాగ్స్, వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేపీ బాబు, సతీష్‌కుమార్, స్వరూప్, ఎన్‌పీ కృష్ణారావు, చిన్ని, శివాజీ నాయుడు, సునీల్ కుమార్, సుంకర శ్రీనివాస్, అత్తిలి శ్రీనివాస్, కాళ్ళ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి పండుగను వృద్ధులతో కలిసి ప్రేమాభిమానాలు పంచుకుంటూ వారితో గడపడం ఎంతో సంతోషంగా ఉందని గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ట్రస్టీ చెన్నా జనార్ధన్‌రావు అన్నారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో 68 మందికి నూతన వస్త్రాలు అందజేయడంతోపాటు సంక్రాంతి పండుగ రోజున వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచారు. హాజరైన ట్రిబుల్ ఎఫ్ అధినేత ఓపీ గోయంక, ఏరియా ఆసుపత్రి సలహాదారులు కె.ధర్మరాజులు మాట్లాడుతూ ఆర్గనైజేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం


దగ్గులూరులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో వేంచేసి యున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన మంచెం శ్రీనివాస్ దంపతులు స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవ పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. రథానికి ముందు కుంభం పోశారు. అలాగే చిన్నారులు, అర్చకస్వామి ఖడ్గం చదివారు. రథోత్సవాన్ని ఎంపీటీసీ శాగ సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రథంపై పూలవర్షం కురిపించారు. చిన్నారులు, యువజనులు, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు రథాన్ని లాగారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం


పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు

ఆకివీడు: రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రాంభమయ్యాయి. పోటీల్లో ఏలూరుపాడు, గునుపూడి, చీరాల, బాపట్ల, కోరుకొల్లు, వేమవరప్పాడు, ఆకివీడు, చెరుకుమిల్లి, కమతవానిగూడెం టీమ్‌లు పోటీ పడ్డాయి. మొదటి రోజు పోటీల్లో ఆయా టీమ్‌లు తలపడుతుంటే క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల ఫైనల్ బుధవారం జరుగనుందని నిర్వాహక కమిటీ ప్రతినిధి డోకల రవి తేజ చెప్పారు.

ఘనంగా నాగారమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

జోరుగా కోడిపందేలు, గుండాటలు

- బరుల్లో నువ్వా?నేనా అంటూ తలపడుతున్న పందెం పుంజులు
- రూ.కోట్లలో చేతులు మారుతున్న సొమ్ము


తేతలి గ్రామంలో కోడి పందేలు


తణుకులో కోడి పందేలను బరి బయట ప్రేక్షకులకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసిన దృశ్యం

తణుకు: సంక్రాంతి పండుగ ముసుగులో ఏటా నిర్వహించే కోడి పందేలు కనుమ రోజు జోరుగా సాగాయి. తణుకు పట్టణంతోపాటు మండలంలోని తేతలి, దువ్వ, వేల్పూరు గ్రామాలతో పాటు ఇరగవరం మండలంలో కొత్తపాడు, కావలిపురం, అత్తిలి మండలంలో లక్ష్మీనారాయణపురం, కె.సముద్రపుగట్టు గ్రామాల్లో పందెం రాయుళ్లు కోడికి కత్తి కట్టి నువ్వానేనా అనే రీతిలో పందేలు నిర్వహించారు. పందేలు నిర్వహించిన బరి వద్ద చుట్టూ బారికేడ్‌లు, విద్యుత్ వెలుగులతో నింపారు. శిబిరాల వద్ద గుండాట, పేకాట, మద్యం విక్రయాలు మూడ్రోజుల పాటు జోరుగా సాగాయి. కేవలం డింకీ పందేలు మాత్రమే నిర్వహించుకోవాలని, కోడికి కత్తి కట్టకూడదని ఎక్కడా జూదం, గుంటాట, కోతాట ఆడకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ యథేచ్ఛగా ఈ ఆటలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి పురస్కరించుకుని ఎలాంటి కోడిపందేలు, జూదం ఆడేందుకు అనుమతులు లేవని పోలీసులు, రెవెన్యూ అధికారులు గత వారం రోజులుగా చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. అనుమానిత ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేయకుండా ఆయా స్థలాలను దుక్కి దున్నించేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి మాత్రం ఆవైపు కన్నెత్తి చూడలేదు. కేవలం జూదం ద్వారా తణుకు నియోజకవర్గంలో మూడ్రోజుల పాటు సుమారు రూ. 3 కోట్లు పైగా పైగా నగదు పందెం రాయుళ్ల చేతులు మారాయని అంచనా.

తణుకు టౌన్: సంక్రాంతి సందర్భంగా తణుకు మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. సంప్రదాయం పేరుతో నిర్వహించే సంక్రాంతి బరుల వద్ద గత మూడు రోజులుగా కోడి పందేలతో పాటు గుండాట, కోతాటలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా కోస్తా ప్రాంతాల్లో నిర్వహించే కోడి పందాలను వీక్షించేందుకు తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారితో పాటు అక్కడ స్థిరపడిన తెలుగువారు కూడా గత మూడు రోజులుగా బరుల వద్దకు చేరుకున్నారు. కోడి పందేల బరుల వద్ద పురుషులతో పాటు మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించడం గమనార్హం. మూడు రోజుల పాటు ఉత్సవాల మాదిరిగా కోడి పందాల బరులు నిలిచాయి. కొన్ని బరుల వద్ద జరిగే కోడి పందాలను వీక్షించేందుకు బరి చుట్టూ లైవ్ ప్రసారాలు ఏర్పాటు చేయడంతో పాటు కోడి పందాలకు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయడం గమనార్హం.

ఎస్‌ఐలు మారారు

తాడేపల్లిగూడెం: విధానపరమైన నిర్ణయాల్లో భాగంగా గూడెం సర్కిల్‌లో సబ్ ఇనస్పెక్టర్లను బదిలీ చేశారు. పట్టణ ఎస్ఐ జీ.జే.రాజును రూరల్ ఎస్ఐ బి.రాజులను భీమవరం వీఆర్‌లకు పంపించారు. భీమవరం రూరల్ ఎస్ఐ బి.మోహన్‌రావును పెంటపాడు ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. భీమవరంలో సీసీఎస్‌లో పనిచేస్తున్న జేవీఎస్.ప్రసాద్‌ను తాడేపల్లిగూడెం పట్టణ ఎస్ఐగా బదిలీ చేశారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

భీమవరం అర్బన్: ప్రతి రోజూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు దేహ దారుఢ్యం పెరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలంలోని కొత్త పూసలమర్రు గ్రామంలో దాతలు ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వాటాల రామరాజుల సౌజన్యంతో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ దైనందిన జీవితంలో పనుల ఒత్తిడితో తీవ్రంగా సతమతమై అనారోగ్యాలకు గురవుతున్నామని, ఇటువంటి క్రీడా పోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తారన్నారు.

ఘనంగా పెంటలమ్మ జాతర మహోత్సవం


పూజలందుకుంటున్న పెంటలమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామ దేవత పెంటలమ్మ అమ్మవారి జాతర, సేవామహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గుడి నుంచి పూరి గుడి వద్దకు తీసుకువచ్చి గరగలతో, డప్పులతో సేవా కార్యక్రమం నిర్వహించారు. మద్దకూరి రామకృష్ణ దంపతులు అమ్మవారికి పొన్పు వేశారు. సంక్రాంతి పురస్కరించుకొని గ్రామ ప్రముఖుడు, దాత రాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు రాయుడు సొంబయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్ నూతన వస్త్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్, రాయుడు లక్ష్మీదినేష్, కోడూరి మంగరాజు, కొండ్రెడ్డి హైమావతి, నలమాటి కృష్ణమూర్తి, ప్రతివాది భయంకర రాఘవాచార్యులు, ఎం.వెంకట సుబ్బారావు, పెంటపాడు రత్తయ్య, అంజూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విప్పర్రులో క్రీడాపోటీలు


మహిళలకు బహుమతులు అందజేస్తున్న సగర కార్పొరేషన్ డైరెక్టర్ కన్నయ్య, తదితరులు

పెంటపాడు: యువత పెడదారిన పడకుండా క్రీడా పోటీలు ఎంతో మేలు చేస్తాయని సగర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఏపీ సగర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి కన్నయ్య పేర్కొన్నారు. సంక్రాంతి పురస్కరించుకొని పడమర విప్పర్రు సగరపేటలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ గత 8ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు విద్యతో ఇటువంటి క్రీడలు ఆడుతూ ప్రత్యేక గుర్తింపు సాధించాలన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కసిరెడ్డి అబ్బయ్యలు మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తారన్న సంగతిని జగనన్న గుర్తు చేస్తూ ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతిసంబరాల్లో విజేతలకు పలువురు బహుమతులు అందజేశారు. మహిళలకు ముగ్గులపోటీలు,యువతకు వాలీబాల్, చిన్నారులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ బోణంనాగ సత్యనారాయణ, జలసూత్రం పండు,విశ్రాంతి ఎస్ఐ శ్రీరామ్మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు కసిరెడ్డి నాగేంద్రభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలను దర్శించుకుంటున్న మంత్రి కుటుంబ సభ్యులు


అత్తిలిలో గ్రామదేవతలను దర్శించుకుంటున్న మంత్రి సతీమణి కారుమూరి లక్ష్మీకిరణ్, ఏలూరు ఎంపీ అభ్యర్థి సతీమణి కారుమూరి కీర్తి

అత్తిలి: మండలంలో గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న వెంకమ్మ, మహంకాళమ్మ అమ్మవార్లను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సతీమణి కారుమూరి లక్ష్మీకిరణ్, వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ సతీమణి కీర్తి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈసందర్భంగా లక్ష్మీకిరణ్, కీర్తిలు అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు యడ్లపల్లి దుర్గారావు, మద్దాల శ్రీనివాస్, యడ్లపల్లి మణికుమార్, యడ్లపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు


తణుకు: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై


తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


అత్తిలి: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని భారతీయతలో అంతర్భాగమైన ముగ్గుల ఆవశ్యకతను తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం ఇంటి వాకిలిలో వేసే ముగ్గు వల్ల బ్యాక్టీరియా దరి చేరదన్నారు. పూర్వీకులు ఎంతో ముందు ఆలోచనతో ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జగన్నాథపురం గ్రామంలో ముగ్గుల పోటీ, కుర్చీలాట, బాలబాలికలకు పరుగు పందెం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పురిటిగడ్డ జయమ్మ, నాయకులు నిచ్చెనకోళ్ల రాముడు, మల్లుల పరమేశు, ఎస్.చిన్ని, ఆర్.సుమన్, ఆర్.అనూష, ఆర్.ప్రసన్న కుమార్, పీలా గాదినాయుడు, మాణిక్యాలరావు, కోటేశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

తణుకు: సాంప్రదాయ క్రీడలను ప్రోత్సమిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఏఐఎస్ఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేసిన ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడారు. విజేతలైన మహిళలు, యువతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, నాయకులు ముదునూరి నాగరాజు, సరిదే శ్రీనివాస్, సరిదే హరి, శేఖర్, తియ్యాల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ అత్తిలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అత్తిలి బ్యాంకువీధిలో జూనియర్, సీనియర్ విభాగాల్లో ముగ్గుల పోటీలు జరిపారు. జూనియర్ విభాగంలో ముగ్గుల పోటీ విజేతలకు రావూరి వెంకట సత్యనారాయణ ఆర్థిక సహాయంతో, సీనియర్స్ విభాగంలో విజేతలకు దాసం ప్రసాద్ ఆర్థిక సహాయంతో బహుమతులు అందజేసారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. క్లబ్ సెక్రటరీ శీతాల వెంకట నారాయణ, యాతం రాంబాబు, దొండమూరి వెంకటేశ్వరరావు, దాసం బాబ్జి, వర్ధినీడి వెంకటశివ, వడ్డి కొండబాబు, సుబ్బరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

సంప్రదాయం.. సంతోషాల కలబోత సంక్రాంతి


గూడెం మండలం నవాబుపాలెంలో పండుగవేళ కలిసిన మద్దుకూరి కుటుంబం


గూడెంలో కలిసిన మద్దాలి, చలంచర్ల కుటుంబ సభ్యులు

పండుగలో కనిపించిన కుటుంబ బంధం

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్ : సంక్రాంతి పండుగలో ఈ సీజన్‌లో కొత్త క్రాంతి కనపడింది. సంస్కృతి, సాంప్రదాయం మరింత జీవం పోసుకున్నట్టు దృశ్యం ఆవిష్కృతమైంది.ముఖ్యంగా కుటుంబ బంధాలు బలపడుతున్న సంకేతాలు సంక్రాంతిలో చోటు చేసుకున్నాయి. రక్త సంబంధీకులతో, వియ్యాల వారితో కలిసి నిండుగా పండుగ చేసుకున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో మద్దుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో మద్దుకూరి గంగాభవానీ, ధనరాజుల ఇంట్లో కుటుంబ సభ్యులు 150 మంది వరకు కలిసి పండుగ జరుపుకున్నారు. పట్టణంలో చలంచర్ల హరి ఇంట్లో ఆయన వియ్యంకుడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ కుటుంబసభ్యులు కలిసి. సరదా సంతోషాలతో కనుమను ఘనంగా చేసుకున్నారు. పల్లె వాతావరణం ప్రతిబింబించే విధంగా ఎడ్ల బండి.సంప్రదాయం నృత్యాలు, గంగిరెద్దుల ఆటలు, ఎడ్లబండి, గిలకబావి,పెంకుటిల్లు, గుడి గోపురం, గాలిపతంగులు, గోదాదేవి, చిన్ని కృష్ణుడు వంటి వాటిని ఏర్పాటుచేసి ఆహ్లాదకర వాతావరణంలో మంగళవారం కనుమ పండుగ కన్నుల పండువగా సాగింది.

చలికాలం.. జరభద్రం!

- జోరుగా స్వెట్టర్ల అమ్మకాలు
- పట్టణంలో ఏర్పాటు చేసిన రాజస్థాన్, మధ్యప్రదేశ్ దుకాణాలు
- ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉన్ని దుస్తులు


అమ్మకాలు జరుగుతున్న దశ్యం

పెంటపాడు: చలి చంపేస్తోంది. చిన్నా పెద్ద అంతా వెచ్చదనం కోసం వెంపర్లాడుతున్నారు. పూర్వం చలిమంటలు వేసుకొని కాచుకొనేవారు. ఇప్పుడు వివిధ రకాల ఉన్ని దుస్తులను వినియోగిస్తున్నారు. ఉన్ని దుస్తుల వినియోగం పెరుగుతుండడతో రాజస్థాన్, మధ్యప్రదేశ్, వారి సొంత ఊర్లను వదులుకొని వచ్చి ఇక్కడ పలు ప్రాంతాల్లో దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఎంతో దూరం నుంచి వచ్చిన వారిని ఇక్కడ ప్రజలు అదరిస్తున్నారు. గూడెం, పెంటపాడు వంటి శివారు గ్రామాల్లోనూ ఉన్ని దుస్తుల విక్రయ దుకాణాలు విస్తారంగా వెలిశాయి. మేజర్ గ్రామాల కూడళ్లలోనూ సుమారు 100దుకాణాల్లో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. ఈ దుస్తులను రూ.300 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ అమ్మకాలు ఉన్న వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

సొంత ఊరుకు దూరంగా...

చలి తీవ్రవ పెరిగిన నేపథ్యంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ వాసుల స్వెట్టర్ల దుకాణాల్లో విక్రయాలు జోరందుకున్నాయి. ఒకప్పుడు భీమవరం, తణుకు వంటి పెద్ద పట్టణ ప్రాంతాలకు పరిమితమైన ఉన్ని దుస్తుల విక్రయ దుకాణాలు ప్రస్తుతం వారు ఇంటింటికీ మోటారు బైక్‌లపై అమ్మకాలు చేస్తున్నారు.

సామాజిక ఐక్యతా జీవన చిత్రం

చలికాలం వచ్చిందనగానే రాజస్థాన్, మధ్యప్రదేశ్ తమ సొంతూరు వదిలి ఇక్కడి ప్రాంతాల్లో ఉన్ని దుస్తులు విక్రయాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. అందుకు కావాల్సిన పెట్టుబడిని సమకూర్చుకొని ఖరీదు చేసి గంపెడాశతో ఇక్కడకు వస్తుంటారు. వారిని స్థానికులు అదరిస్తూ దుకాణాలకు ఖాళీ స్థలాలను, అద్దెకు ఇళ్లను సమకూర్చుతున్నారు. సాధారణంగా నవంబరు నుంచి ఫిబ్రవరి వరకూ నాలుగు నెలలు పాటు వ్యాపారం జోరుగా సాగుతోంది. పెద్ద దుకాణాదారులైతే సీజన్ అయిన తర్వాత సరుకు మిగిలిపోతే స్థానికంగానే భద్రపర్చుకొని తర్వాత ఏడాది సీజల్లో విక్రయిస్తుంటారు.

నాణ్యత, ఆకర్షణలతో...

వివిధ రకాల డిజైన్లలో స్వెట్టర్లు అందుబాటులో ఉంచుతున్నారు. స్వెట్టర్లు, బ్యాంకెట్లు, జంబుఖానాలు, రెయిన్‌కోట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, జర్కిన్లు, గరంకోట్లు ఇలా రకరకాల ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. అవే దుస్తులను చేతితో అల్లినవి సైతం తీసుకొస్తున్నారు. శ్రమతో కూడిన అల్లిక సరుకుల ధర కాస్త, అధికంగా ఉంటుంది. స్వెట్టర్ల ధర నాణ్యత, డిజైన్లను బట్టి రూ.300నుంచి 700వరకూ ఉంటుంది. చిన్న పిల్లలకు రూ.250నుంచి 700వరకు ఉన్నాయి.

> **శరీర రక్షణపై అవగాహన అవసరం**
>
> చలికాలంలో శరీర రక్షణకు ఉన్ని దుస్తులు మంచివి, వాటిని క్రమం తప్పకుండా శుభ్రపర్చుకుంటూ ధరిస్తుండాలి. ఇంటిలో నిద్రపోతునప్పుడు ఉన్ని దుస్తులను వేసుకోవడం మంచిదికాదు. చలి ప్రభావాలకు జాగ్రత్త వహించాలి. పొగమంచు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. చలివంక పేరుతో స్నానం చేయడాన్ని విస్మరించడం అస్సలు చేయకూడదు
>
> – పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత, ముదూనూరు పీహెచ్‌సీ

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

నరసాపురం: రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడతాయని నరసాపురం సీఐ కేఏ స్వామి అన్నారు. నరసాపురం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన సీఐ మాట్లాడుతూ వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో, రోడ్డు మార్జిన్‌లో నడపాల్సి వచ్చిన సందర్భాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.ధనలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.